# పొంచివున్న జన్యుమార్పిడి ఆహార ముప్పు

**హర్యానా** రాష్ట్రంలోని ఫతేబాద్‌జిల్లా పాటియా ప్రాంతంలో కొందరు రైతులు జన్యుమార్పిడి వంకాయలను పండిస్తున్నట్లు, అయితే వారు పండిస్తున్నవి జన్యుమార్పిడి వంగడాలన్న విషయమే ఆ రైతులకు తెలియదనే విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. వీరు స్థానిక నారు వ్యాపారుల వద్దనుండే ఈ నారును (మొక్కలను) కొనుగోలు చేశారు.

మనదేశంలో జన్యుమార్పిడి ఆహార పంటపై 2020 ఫిబ్రవరి వరకు నిషేధం వుంది. జన్యుమార్పిడి పంటలు పండించడానికిగానీ, విత్తనాలు లేక నారును మార్కెట్లో అమ్మడానికిగాని అనుమతిలేదు. కాని ఈ జన్యుమార్పిడి నారు అనధికారికంగా, చట్ట వ్యతిరేకంగా మన దేశంలోకి ప్రవేశించింది. అమాయక రైతులకు దీనిని అమ్ముతున్నారు. ఫలితంగా జన్యుమార్పిడి వంకాయలు దేశంలోకి ప్రవేశపెట్టబడి మార్కెట్లో అమ్మకాలు జరుగుతున్నాయి.

మహికో సంస్థ ఇలా చేస్తున్నది. గుత్త బహుళజాతి మోన్‌శాంటో అధీన సంస్థ, జన్యు మార్పిడి వంకాయల ఉత్పత్తిదారు మోన్‌శాంటో భారత దేశంలో వీటిని అనుమతించలేదు కాబట్టి వీటిని పండించడం, అమ్మడం యిక్కడ నేరమవుతుంది. అయితే బంగ్లాదేశ్ ప్రభుత్వం నుండి ఆ దేశంలో జన్యుమార్పిడి పంటలు పండించడానికి, అమ్మడానికి అనుమతి పొందింది. భారతదేశంలో అనుమతి పొందకముందే ఈ కంపెనీ బంగ్లాదేశ్‌లో పెంచిన నారును హర్యానాలోని అమాయక రైతులకు అమ్మి యిక్కడ ఆ వంగడం సాగును దొంగచాటుగా చేయిస్తోంది.

ఈవిధంగా చట్టవ్యతిరేకంగా జన్యుమార్పిడి వంకాయలను తన అధీన సంస్థద్వారా భారత దేశంలో ప్రవేశపెట్టి మోన్‌శాంటో కంపెనీ భారతదేశంలో బి.టి.వంగ సాగుకు రంగం సిద్ధపరుస్తూ వుంది. అలాగే దీని సాగుకు అనుమతి యివ్వవలసిందిగా భారతదేశంపై ఒత్తిడి తెస్తూ వుంది.

సంబంధిత ప్రభుత్వ నియంత్రణా సంస్థల సహకారం లేకుండా వాటి రహస్య అంగీకారం లేకుండా మహికో అనధికారికంగా, చట్ట వ్యతిరేకంగా భారతదేశంలో బి.టి. వంగ సాగు చేయించి అమ్మగలుగుతుందని అనుకోలేము. హర్యానాలో వున్న పరిస్థితుల దృష్ట్యా యిలా చెప్పడం ఎంతమాత్రం తప్పుకాదు.

నియంత్రణా కమిటీయైన జి.ఇ.ఎ.సి భారతదేశంలో జన్యుమార్పిడి వంకాయల సాగు, అమ్మకాలు జరుపుతున్న ఆ కంపెనీకి స్నేహ హస్తాన్ని అందిస్తోంది. అంటే ఈ నియంత్రణా కమిటీ తాను నిర్వర్తించాల్సిన మౌలిక విధి– జన్యుమార్పిడి ఆహార వినియోగం ద్వారా సంభవించే ఆరోగ్య దుష్ప్రభావాల నుండి భారతీయ ప్రజలను రక్షించడం – నుండి వైదొలుగుతున్నది.

అభివృద్ధిచెందిన ఐరోపా దేశాలు మరియు జపాన్ లాంటి దేశాలు ప్రజల ఆరోగ్యానికి హానికరమని తమ దేశాల్లో జన్యుమార్పిడి ఆహారాలను సాగుచేయడం, అమ్మడాన్ని నిషేధించాయి. కాని భారతదేశంలోని నియంత్రణా కమిటీలు మరియు భారతపాలకులు మాత్రం ఈ విషయంలో కంపెనీలపట్ల సానుభూతితో వ్యవహరిస్తూ, బి.టి. ఆహార పంటలసాగుకు, భారతదేశంలో ఆహార వాణిజ్యం చేసుకోవడానికి ఈ కంపెనీల పట్ల మొగ్గు చూపుతున్నారు.

బి.టి. ఆహారం ప్రజల ఆరోగ్యానికి హానికరం కాదనే విషయం ఇంకా స్పష్టంగా రుజువు కాలేదు. అనేకమంది ప్రఖ్యాత మరియు నిజాయితీగల శాస్త్రవేత్తలు ఈ బి.టి. ఆహారం ప్రజల ఆరోగ్యానికి హానికరమని, తక్షణం వాటి ప్రభావం కన్పించకపోయినా దీర్ఘకాలంలో వాటి దుష్పరిణామాలు బయట పడతాయిని హెచ్చరిస్తున్నారు.

కానీ, భారత ప్రభుత్వం మాత్రం చట్ట వ్యతిరేకంగా జన్యుమార్పిడి వంగనారును తెచ్చి అమాయక రైతులకు అమ్ముతున్న వారిపై తీవ్రమైన చర్యలు తీసుకోవలసిందిపోయి అమాయక రైతులపైననే చట్ట వ్యతిరేకంగా సాగు చేస్తున్నారని ఆరోపిస్తూ వారి పంటలను నాశనం చేస్తూ బి.టి. వంగ సాగు ప్రమాదాన్ని నివారిస్తున్నట్లు ప్రకటించుకుంటున్నది. ఆవిధంగా అమాయక రైతులు నేరస్థులుగా ముద్రవేయబడి దోషులుగా మిగిలిపోవడంతోబాటు ఆర్థికంగా నష్టాల పాలవుతున్నారు.

మరోవైపు జన్యుమార్పిడి ఆహార విత్తనాలను ఉత్పత్తిచేసి అమ్ముతున్న మోన్‌శాంటో కంపెనీ అండదండలతో జన్యుమార్పిడి పంటల పైరవీదారులు రైతు సంఘాల ముసుగులో బి.టి. సాగును నిషేధించడానికి వ్యతిరేకంగా కృత్రిమ ఉద్యమాలను సృష్టిస్తున్నారు. జన్యు మార్పిడి పంటలవల్ల కలిగే ప్రయోజనాలను నిరాశా నిస్పృహల్లో వున్న భారత రైతాంగానికి అందకుండా ప్రభుత్వం అడ్డుపడుతుందనే ప్రచారాన్ని చేస్తున్నారు.

ఏది ఎలా వున్నప్పటికీ చట్టవ్యతిరేకంగా, అనధికారికంగా జన్యుమార్పిడి ఆహార పదార్థాలు భారతీయ ఆహార రంగంలోకి చొచ్చుకు వచ్చాయి.

బి.టి. ప్రత్తి సాగుకు అనుమతించిన తర్వాత వాటి విత్తనాలనుండి నూనె తీస్తున్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ముఖ్యంగా గుజరాత్, మహారాష్ట్రలలో ఈ నూనెను వాడు తున్నారు. అంతేకాదు భారతదేశంలో పండించిన జన్యుమార్పిడి విత్తనాలను ఆ కంపెనీలు తిరిగి మనదేశానికే దిగుమతి చేసి వాటినుండి కనోలా నూనె, సోయాబీన్ నూనెను తీస్తున్నారు.

ఇదంతా తెలిసి కూడా చట్టవ్యతిరేకంగా దేశంలోకి వస్తున్న జన్యుమార్పిడి పదార్థాలపట్ల భారత పాలకులు, మరియు నియంత్రణా కమిటీలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నాయి.

ఇదీ జన్యుమార్పిడి ఆహారం ద్వారా దేశం ఎదుర్కొంటున్న ముప్పు! ఈ ముప్పు చట్ట వ్యతిరేక సాగు ద్వారా వస్తున్న ముప్పుకాదు. వీటి సాగును చట్టబద్ధంగా అనుమతించినా ఈ ముప్పు ఆగదు.

కాని మన పాలకులు మరియు ప్రభుత్వాలకు మనదేశ ప్రజల ప్రయోజనాలపట్ల ఆసక్తి లేదు. వారి వర్గ స్వభావరీత్యా సామ్రాజ్య వాదులకు సేవ చేయడమే వారి పరమావధి. అందువల్ల ఈ పాలకులు, ప్రభుత్వాలు నయానో భయానో జన్యుమార్పిడి పంటలను ఈ దేశంలోకి తీసుకురావడానికి మార్గాన్ని సుగమం చేయడానికే ఆసక్తి చూపుతారు. ఇదే అసలైన ముప్పు. దీనికి వ్యతిరేకంగా మనం పోరాడాల్సి వుంది.